**83**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి
99893 71284

**చారిత్రక కాల్పనిక నవల**

**జరిగిన కథ :** ఆస్థానవైద్యుడు తిరునగరిభోట్లు అనుచరుడు కొండుభోట్లును ఎవరో చంపి.. జాయపుని పురనివాసం ముందు పడేసి పోయారు. ఆ శవాన్ని చూసి తెల్లబోయాడు జాయపుడు. నారాంబ కొడుకు, జాయపుని మేనల్లుడు హరిహరదేవుడు అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఈ కొండుభోట్లే దగ్గరుండి మరీ వైద్యం చేస్తున్నాడు. వెంటనే నారాంబకు విషయం చెప్పాడు. అది విని నిలువెల్లా వణికిపోయింది నారాంబ.కొండుభోట్లు మరణం వెనకాల ఏదో కుట్ర ఉన్నదని జాయపుడు గ్రహించాడు. చాలా ఉద్విగ్నుడయ్యాడు.

ఈ ప్రచ్ఛన్నయుద్ధం కంటే ప్రత్యక్షంగా ఎదురుబదురుగా నిలబడి ధర్మయుద్ధం చెయ్యడం చాలా తేలిక. ఉద్రేకం క్షణక్షణానికీ పెరిగిపోతుండటంతో రాజనగరి ముందుకు వచ్చాడు జాయపుడు. అక్కడ కోట శ్రీవాకిలి అంకయనాయకుడు.. పుర రక్షకభటులకు ఏదో చెబుతూ తీవ్రంగా హెచ్చరిస్తున్నాడు. ఆయన వద్దకు వేగంగా వెళ్లాడు.

తీవ్ర స్వరంతో..

''ఏం చేస్తున్నారు దండనాయకుడు గారూ.. రాజధానిలో హత్యలా!? రాజాస్థానపు వైద్యుణ్ని ఎవరో నరికి చంపి.. ఆ శరీర భాగాలను నడివీధిలో చక్కగా అలంకరించి పెట్టారు. మనమంతా యుద్ధాలలో శత్రువులను చంపుతాం కానీ రాజధానిలో ఆస్థానవైద్యుణ్ని చంపడం ఏమిటి.. ఇది ఎలా జరిగింది?''..

రాజనగరి పరిసరాలలో అధికారగణాలను ధిక్కరించి వేలెత్తి చూపుతూ ఇలా అరచి మాట్లాడటం జరగదు.

సాధారణ సంభాషణ కూడా చాలాతక్కువ గొంతుకతో మాట్లాడేచోట.. జాయపసేనానిలాంటి ముఖ్య నాయకుడు ఇలా మాట్లాడటం పెద్ద విశేషం.

జాయపుణ్ని అనునయించడానికి శ్రీవాకిలి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. కానీ, చాలా ఉద్రేకంగా ఉన్న జాయపుడు తగ్గడంలేదు. అకస్మాత్తుగా అతని దృష్టి పక్కనున్న ధర్మగంట మీదికి పోయింది. తీవ్ర ఉద్రేకంగా ఉన్న జాయపునికి అది చక్రవర్తి మొదటికొలువు ప్రారంభమయ్యే సమయమని గుర్తొచ్చింది. మరి ఆలస్యం చెయ్యకుండా వేగంగావెళ్లి ఆ ధర్మగంటను మోగించాడు.

లోపలినుంచి రాజ్యకార్యకలాపాల నియోగమంత్రి ధమ్మకీర్తి బయటికి పరిగెత్తుకొచ్చాడు.

''కాకతీయ రాజ్య రాజధాని నగరంలో ఆస్థానవైద్యులకే దిక్కులేదు. చంపి ముక్కలుచేసి వీధిలో పరుస్తున్నారు. దీనికి అధికారులు ఏం సమాధానం చెబుతారు? చక్రవర్తినే అడుగుతాను!''..

అధికారులంతా జాయపుని దగ్గరకువెళ్లి ఆయన్ను చుట్టుముట్టి అనునయించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ ఆయన తగ్గడంలేదు. అలాంటిది ఉన్నట్టుండి అందరూ జాయపుణ్ని వదలి కాస్త పక్కకు జరిగారు.

అరచి మాట్లాడుతున్న జాయపుడు తలెత్తిచూస్తే.. రాజనగరు సింహద్వారం వద్ద నిలబడి నిప్పులు చెరిగే కళ్లతో చూస్తున్న గణపతిదేవుడు!! క్షణకాలం తొట్రుపడ్డ జాయపుడు తమాయించుకుని..

''చూశారా దేవరా.. రాజధాని నగరంలో జరిగిన ఘోరం. నా భవంతి ముందు మన వైద్యుణ్ని చంపి పడేశారు. ఇది ఎంత ఘోరం. ఇలా అయితే మన నగరం, కాకతీయ రాజ్యపు..''.

''ఆపు.. ఆపు! ఏమా ధిక్కారం!? ఏమా వాచాలత్వం!? ఆపు ఆపు..'' గర్జించాడు గణపతిదేవుడు.

అందరూ అదిరిపడి ఆయన ముందు తలవంచి నిలబడ్డారు. ఉగ్రుడైన చక్రవర్తిని చూడగానే జాయప కాస్త తగ్గాడు. ఉద్రేకం కాస్త చల్లబడింది. చక్రవర్తి బయటికి రావడం చాలా పెద్దవిషయం..

క్రోధారుణ దృక్కులతో..

''న్యాయాధికారికి చెప్పి ఈ వాచాలుణ్ని కారాగా